పెయింటింగ్స్‌ భళా..!





గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని పార్కు ప్రహరీగోడపై గ్రామీణ ప్రాంత రైతన్నలు, పంటపొలాలను ప్రతిబింబించేలా వేసిన చిత్రాలు ఇవే..

- చిత్రాలతో కళ్ల ముందుకు గ్రామీణ వాతావరణం
- ప్రహరీగోడలకు పెయింటింగ్స్‌తో మరింత శోభ
- మారిన జీహెచ్‌ఎంసీ పార్కు రూపురేఖలు

శేరిలింగంపల్లి: దేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా వేసిన పెయింటింగ్స్‌ 'భళా' అంటున్నాయి. శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని పార్కు ప్రహరీ గోడలపై కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో చక్కటి, ఆకట్టుకునే తరహాలో పెయింటింగ్స్‌ వేయించడం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంతానికి వచ్చిన వారిలో ఎక్కువ గ్రామీణ ప్రాంతం వారే అధికంగా ఉండడంతో ఈ చిత్రాలు చూడగానే వారికి తమ స్వస్థలాలలోని పరిస్థితులు కళ్లకు కనిపించేలా ఈ చిత్రలు ఉండటంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పార్కులో గ్రీనరీ ఇతర అన్ని రకాల మౌలిక వసతులు కల్పించిన విషయం తెలిసిందే. కొత్తగా ఈ పెయింటింగ్స్‌ వేయించడంతో పార్కు మరింత ఆకర్షణీయంగా మారింది. పార్కును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఇలాంటి చర్యలు చేపట్టడం అందరినీ ఆకట్టుకునేలా చేసింది.



గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని పార్కు ప్రహరీగోడపై తల్లీ బిడ్డ



గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని పార్కు ప్రహరీగోడపై గ్రామీణ ప్రాంతంలో గీత కార్మికులు, స్థానికుల పరిస్థితి

ఆకట్టుకునేలా 60 పెయింటింగ్స్‌..

గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కులో గ్రామీణ ప్రాంతాలను ప్రతిబింబించేలా 60 రకాల పెయింటింగ్‌ వేయించడం విశేషం. నేటి తరం వారికి గ్రామీణ వాతావరణాన్ని ఇట్టే అవగాహన చేసుకునేలా పెయింటింగ్స్‌ వేయించడం అందరినీ ఆలోచింపజేస్తుంది. పార్కు కాలనీలో హరికథ, బుర్రకథ కళాకారులు, గంగి రెద్దులు, గ్రామీణ వాతావరణం, పిల్లలు స్కూలుకెళ్లడం, రైతన్నలు, ఎడ్లబండి, పంటలు ఇంటికి తరలించడం, ఆవుపాలు పిండడం, పాలు అమ్మకం, తల్లీబిడ్డలు ఇలా రకరకాలకు చెందిన గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా చిత్రాలు ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ పేయింటింగ్స్‌కు దాదాపు రూ.2.60 లక్షల వ్యయం అయింది.





గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని పార్కు ప్రహరీగోడపై హరికథ,బుర్రకథ, వాయిద్యాలతో కళాకారులు, గంగిరెద్దులు

క్లుప్తంగా

సోషల్‌ మీడియాలో మెసేజ్‌లను గుడ్డిగా నమ్మొద్దు

చందానగర్‌ సీఐ పాలవెల్లి



చందానగర్‌ సీఐ పాలవెల్లి

చందానగర్‌: సోషల్‌ మీడియాలో వచ్చే మెసేజ్‌లను గుడ్డిగా నమ్మొద్దని చందానగర్‌ సీఐ పాలవెల్లి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్‌ మీడియాలో వచ్చే మెసేజ్‌లను గుడ్డిగా నమ్మి ఎలాంటి గ్రూప్‌లోకి కూడా పంపవద్దన్నారు. వచ్చిన మెసేజ్‌లను నిజ నిర్ధారణ చేసుకున్న తరువాతనే మీకు సంబంధించిన గ్రూపులలో పంపాలని సూచించారు. ఒకవేళ నిజ నిర్ధారణ చేయకుండా పంపితే గ్రూప్‌ అడ్మిన్‌ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇష్టానుసారంగా వచ్చిన మెసేజ్‌లను వెంటనే గ్రూప్‌ అడ్మిన్‌ వాటిని డిలీట్‌ చేసి అటువంటి మెసేజ్‌లను ఫార్వర్డ్‌ చేసిన వారిని గ్రూప్‌ నుంచి డిలీట్‌ చేయాలన్నారు. ఒకవేళ అలా చేయని తరుణంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని సీఐ పాలవెల్లి తెలిపారు.

విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ సరఫరాను శనివారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. 11 కేవీ నేతాజీనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు బాపూనగర్‌, నెహ్రూనగర్‌, గోపీనగర్‌లలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తారు. 11కేవీ గుల్‌మొహర్‌ పార్కు ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటలవరకు గుల్‌ మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్‌ ఏరియాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

మియాపూర్‌లో...

మియాపూర్‌: ఈ –సేవా ఫీడర్‌, ఎస్‌ఆర్‌ ఎస్టేట్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేయం జరుగుతుందని ఏఈ శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బాలాజీనగర్‌, ఆర్‌బీఆర్‌ కాంప్లెక్స్‌, ఎస్‌ఆర్‌ ఎస్టేట్‌, పాట్లపల్లి అపార్ట్‌మెంట్‌, వడ్డెర బస్తీ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనిని విద్యుత్‌ వినియోగదారులు గమనించి విద్యుత్‌ అధికారులకు సహకరించాలని తెలిపారు.

చందానగర్‌: వేమన కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. భవానీపురం ఫీడర్‌ పరిధిలో భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్‌ సెక్షన్‌ కాలనీ, శంకర్‌నగర్‌, ఫ్రెండ్స్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలో అర్జున్‌రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్‌, ఫ్రెండ్స్‌ కాలనీ, గౌతమీనగర్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించి సహకరించాలని కోరారు.


మెరిసిన 'రెసోనెన్స్‌'



సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీ, ఐఈఎల్‌టీఎస్‌ అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రెసోనెన్స్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూట్స్‌ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని సంస్థ తెలంగాణ, ఏపీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం మాదాపూర్‌ గ్లోబల్‌ క్యాంపస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాత విదేశీ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులను సంసిద్ధం చేయడమే లక్ష్యంగా రెసోనెన్స్‌ గ్లోబల్‌ను స్థాపించామని పేర్కొన్నారు. మాదాపూర్‌ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు ఈ పరీక్షల్లో అద్భుతమైన మార్కులు సాధించారని వెల్లడించారు. ప్రపంచంలో ప్రతిభావంతులైన విద్యార్థులతో పోటీపడి ఎంఐటీ, హార్వార్డ్‌, స్టాన్‌ఫర్డ్‌, అక్స్‌ఫర్డ్‌ వంటి సంస్థల్లో ప్రవేశం పొందేందుకు అర్హత సాధించారని వివరించారు.

మహిళల రక్షణ కోసమే షీటీం

ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ



పటాన్‌చెరు టౌన్‌: మహిళలు, విద్యార్థుల రక్షణకు షీటీంలు ఉన్నాయని పటాన్‌చెరు ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ అన్నారు. శుక్రవారం మండలం ముత్తంగిలోని మహాత్మాజ్యోతి బాపూలే వసతి గృహంలో విద్యార్థులకు షీటీం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. షీటీం బృందాలు బస్టాండ్‌లో విద్యా సంస్థల వద్ద మఫ్టీలో తిరుగుతూ మహిళలకు రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లో విద్యార్థులు డయల్‌ 100కు కాల్‌ చేయాలని సూచించారు. సైబర్‌క్రైమ్‌ జరిగిన వెంటనే 1930కు కాల్‌ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



సాయిలు (ఫైల్‌)

మియాపూర్‌: వేర్వేరు ఘటనలలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్‌ జిల్లా పెద్దశంకరంపేట మండలం ముసాపేటకు చెందిన సాయిలు (50) మియాపూర్‌ లక్ష్మీనగర్‌ కాలనీలో నివాసముంటున్నాడు. సొంత గ్రామంలో ఇంటిని నిర్మాణం చేస్తున్నందున భార్య, పిల్లలు ఊరిలో ఉంటున్నారు. కాగా కొంతకాలంగా పనిలేకపోవడంతో తన కుమారుడికి ఫోన్‌ చేసి ఇక్కడ పనులు దొరకడం లేదు ఊరికి వస్తానని చెప్పి డబ్బులు పంపించమని ఫోన్‌ చేశాడు. ఈనెల 24వ తేదీన ఇంటి తలుపులు తెరచి ఉండడంతో చుట్టుపక్కల వారు అతడి ఊరికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా సాయిలు కనిపించలేదు. దీంతో సాయిలు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో



రాములు(ఫైల్‌)

మియాపూర్‌ న్యూకాలనీకి చెందిన కె.రాములు (31) భార్య సంగీతతో కలిసి నివాసముంటున్నాడు. ఈనెల 14వ తేదీన రాములు భార్య సంగీత దగ్గర డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో రాముల భార్య సంగీత ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి



కాయిదమ్మకుంట చెరువును ఉప్పలపాటి శ్రీకాంత్‌ కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

- పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువును నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌, సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌, మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టనున్నామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం కాయిదమ్మకుంట చెరువును కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు గౌతమ్‌గౌడ్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయిదమ్మకుంట చెరువులో మురుగునీరు కలవకుండా ఇరిగేషన్‌ అధికారంలో గతంలో యూజీడీ పైప్‌లైన్‌ చేపట్టడం జరిగిందన్నారు. పైప్‌లైన్‌ పనులు అసంపూర్తిగా ఉండడం, ఔట్‌లెట్‌లో నీరు సక్రమంగా పోవడం లేదన్నారు. ఔట్‌లెట్‌ను సరిచేసి మురుగునీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. నెక్సస్‌ సెలెక్ట్‌ మాల్స్‌, సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌, మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టనున్నామని, చెరువు దశ దిశ మారిందని ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరనుందన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్‌, అలుగు నిర్మాణం, సుందరీకరణతో అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. చెరువులో గుర్రపు డెక్క వల్ల దోమల పెరగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనారోగ్యాలకు గురవుతున్నామని తనకు ఫిర్యాదులు అందాయన్నారు. చెరువు చుట్టుపక్కల కాలనీవాసులు చెరువును సంరక్షించడంలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్‌ బొట్ట, చైతన్య, నాయకులు సుదేశ్‌, నాగరాజు, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌: నియోజకవర్గంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణ పనులను ఆయన కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునాథం చెరువు సుందరీకరణంలో భాగంగా నెక్సెస్‌ సెలెక్ట్‌ మాల్‌ కంపెనీ వారి సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా మల్లిగావాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చెరువు అభివృద్ధి పనులను చేపడుతున్నారని అన్నారు. చెరువు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గురునాథం చుట్టుపక్కల ప్రాంతవాసుల ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరనుందని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చెరువును అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్లిగావాడ్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు, ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్‌ బొట్టా, చైతన్య తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి



మంజూరు పత్రాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌

శేరిలింగంపల్లి: ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్‌ అన్నారు. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా మంజూరైన రూ. 60 వేల మంజూరు పత్రాలను బాధితులకు వి.జగదీశ్వర్‌గౌడ్‌ శుక్రవారం అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని శంషీగూడకు చెందిన మంజుల వైద్య ఖర్చుల కోసం జగదీశ్వర్‌గౌడ్‌ కలిసి పరిస్థితిని వివరించి, సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా సహాయం కోరగా, వెంటనే దానికి అవసమైన ప్రక్రియ పూర్తి చేసి మంజూరు పత్రాలను మంజులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అనారోగ్యా లపాలు అయినప్పుడు సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మేలు కలుగుతుందన్నారు. అర్హులకు సీఎంఆర్‌ఎఫ్‌ సహాయం అందేలా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్వారీ శశిధర్‌, వెంకన్న, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

'అమీబా' పుస్తకం ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ఆఫ్రికన్‌ దేశాలలో కార్పొరేట్‌ రంగాన్ని పునర్‌ నిర్మించిన అంతర్జాతీయ వ్యాపారవేత్త మోటపర్తి శివరామ వరప్రసాద్‌ జీవిత కథతో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ రచించిన అమీబా (అతడు ఆఫ్రికాని జయించాడు) పుస్తకావిష్కరణ కార్యక్రమం కొండాపూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా అధ్యక్షులు డాక్టర్‌ జయప్రకాష్‌ నారాయణ మాట్లాడుతూ దృఢసంకల్పం, లక్ష్యశుద్ధి పాటు ఉద్యోగి సంక్షేమం పట్ల అచంచలమైన నిబద్ధత కలిగిన 'మోటపర్తి' కథ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఒక ప్రమాణంగా నిలుస్తుందని అన్నారు. రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ మాట్లాడుతూ 'అమీబా' అనేది ఒక పుస్తకం కంటే ఎక్కువనీ, అడ్డంకులను అవకాశాలుగా మార్చుకుని, తెలియని ప్రాంతాలను జయించిన వ్యక్తికి సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథనమని పేర్కొన్నారు.

అధునాతన విద్యా విధానం అవసరం

ఐఎస్‌టీఎం జాయింట్‌ డైరెక్టర్‌ గుంజన్‌ గాంధీ



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గుంజన్‌ గాంధీ తదితరులు

మాదాపూర్‌: దేశంలో 2040 సంవత్సరంకల్లా నిరక్ష్యరాస్యతను పూర్తిగా రూపుమాపడంతోపాటు అధునాతన విద్యా విధానాలను విద్యార్థులకు అందించాలంటే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ సెక్రటేరియట్‌ ట్రైనింగ్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ (ఐఎస్‌టీఎం) జాయింట్‌ డైరెక్టర్‌ గుంజన్‌ గాంధీ తెలిపారు. మాదాపూర్‌లోని మెరీడియన్‌ స్కూల్‌లో నగరంలోని సీబీఎస్‌ఈ 83 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంజన్‌గాంధీ మాట్లాడుతూ జాతీయ విద్యావిధాన పాలసీలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఆ మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించే విధానాలను సైతం మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయని దానికి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. సులువైన విధానాల ద్వారా విద్యార్థులకు మరింత అర్థవంతంగా పాఠాలు బోధించే శక్తి ఉపాధ్యాయులకు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరువనంతపురం రిసోర్స్‌పర్సన్‌ ప్రదీప్‌ జార్జ్‌, విజయవాడ సీఓఈ అరుణ, మెరీడియన్‌ ప్రిన్సిపాల్‌ కరణం భవాని తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌ సింగ్‌ మరణం దేశానికి తీరని లోటు



మన్మోహన్‌ సింగ్‌ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రవి కుమార్‌యాదవ్‌



మన్మోహన్‌ సింగ్‌కు నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌

గచ్చిబౌలి: గొప్ప రాజనీతిజ్ఞుడు, సంస్కరణల రూపకర్త మాజీ ప్రధాని మన్మోహన్‌ సింగ్‌ మరణం దేశానికి తీరనిలోటని బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జి ఎం.రవి కుమార్‌ యాదవ్‌ పేర్కొన్నారు. శుక్రవారం మసీద్‌బండలో బీజేపీ కార్యాలయంలో మన్మోహన్‌ సింగ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, పేదల కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం, జాతీయ ఆహార భద్రత చట్టం, విద్యా హక్కు చట్టం, ప్రతి పౌరునికి ఆధార్‌ గుర్తింపు కార్డు తదితర సంస్కరణలను మన్మోహన్‌ సింగ్‌ తీసుకొచ్చారని గుర్తు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆయన దేశానికి చేసిన సేవ, రాజకీయ జీవితం వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు సాగర్‌, రమేష్‌, రాజు, కుమార్‌, పద్మ, రేణుక, మహేష్‌, మధు, మనోజ్‌, గణేష్‌, ప్రదీప్‌ తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో...

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

శేరిలింగంపల్లి/రాయదుర్గం: మాజీ ప్రధాని డాక్టర్‌ మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. నల్లగండ్లలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్‌ చిత్రపటానికి కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించిన మన్మోహన్‌సింగ్‌ మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రధానిగా సేవలందించి గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు టి కృష్ణ, రాఘవరావు, సాంబశివరావు, ప్రభాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గఫార్‌, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణగౌడ్‌, వెంకట్‌రెడ్డి, రవి కుమార్‌, కార్తీక్‌, పోచమ్మ, శివాగౌడ్‌, బాలరాజ్‌, శివానందరెడ్డి, దుర్గేష్‌, సాయికిషోర్‌ తోపాటు పలువురు పాల్గొన్నారు.

రాయదుర్గంలో కాంగ్రెస్‌, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు మన్మోహన్‌ సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు భరత్‌గౌడ్‌, నాయకులు ఎస్‌. రాములుగౌడ్‌, సందీప్‌రెడ్డి, సతీష్‌కుమార్‌, రవి, వినోద్‌కుమార్‌, అవినాష్‌, సోహెల్‌, సత్యనారాయణ, సాయయాదవ్‌ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌

శేరిలింగంపల్లి/రాయదుర్గం: ప్రధాన రహదారిపై ఉండే మ్యాన్‌హోల్‌ నోరు తెరుచుకుంది. దీంతో వాహనదారులు భయం భయంగానే మ్యాన్‌హోల్‌ పక్క నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గోపన్‌పల్లి నుంచి నల్లగండ్లవైపు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉండే మ్యాన్‌హోల్‌ మూత శిథిలమైంది. దీంతో ఇందులో ఎవరైనా లేదా వాహనం ఇరుక్కునే ప్రమాదం నెలకొంది. ముఖ్యంగా రాత్రుల్లో ఇటుగా ప్రయాణం సాగించే వారు ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉంది. గత అయిదు రోజులుగా ఈ పరిస్థితి ఇలానే ఉండడంతో ఎవరూ ప్రమాదానికి గురికాకుండా స్థానికులే అక్కడ ఓ కర్రను ఉంచి అప్రమత్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు శిథిలమైన మ్యాన్‌హోల్‌ మూత స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గోపన్‌పల్లి- నల్లగండ్ల రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌